# గుడ్డోడి చెట్టు

"గుడ్డోడిచెట్టు - గుడ్డోడిచెట్టు"

కండక్టరు తను కూర్చున్నచోటు పక్కన ఇనపరాడ్ మీద కొట్టి అరుస్తూంటేనే నొక్కసారి ఉలిక్కిపడి చూశాను. బస్సు ఆగటంతో కిటికీలోంచి చూశాను. నిజమే "గుడ్డోడి చెట్టు" నా చూపులు చెట్టు కిందికి పరుగెత్తాయి. అక్కడ గుడ్డోడు... కాని....కాని..

\+ + +

"గుడ్డోడి చెట్టు....గుడ్డోడిచెట్టు..."

బస్సుకండక్టర్ అరిచాడు. బస్సుఆగింది. కిటికీ దగ్గర కూర్చున్న నేను ఊహల్లోంచి బయటపడ్డాను. "గుడ్డోడికి ధర్మం చెయ్యండి". అంటూ బస్సుక్లీనరు అందరి దగ్గరకు తిరుగుతున్నాడు. "ఎవరాగుడ్డోడు"? అన్నాను నాదగ్గరికొచ్చిన క్లీనరుతో "అడే బాబూ ... ఆ తురాయి చెట్టు కింద నిలబడలే. అడే" అన్నాడు. నాకుతోచిన నాణెం ఇచ్చిఅతనివేపు కుతూహలంగా చెట్టు కిందికి చూశాను.

"ఇంతమంది ఇతనికి సహాయపడాలను కుంటున్నారు. అతను మీకేమ వుతాడు? ఇతనెవరు?" అడిగాను కండక్టర్‌ని.

"ఇతను ఒకప్పుడు బస్సులో క్లీనరుగా పనిచేసేవాడు. ఏక్సిడెంట్‌లో చూపు పోయింది. అడూ మడిసే బాబూ. అడూ బతకాలిగా. ఇక్కడ ఈ పక్కనే అతని ఊరు. ఇక్కడే మేమందరం ఒక గుడిసె వేయించి ఇచ్చాం. బస్సులాపి...ఇదో... ఇలా మీలాటి ధర్మాత్ముల్ని దగ్గర చెయ్యిసాచి ఈడ్ని పోషిస్తున్నాము". అన్నాడు కండక్టరు.

కండక్టరు మాటలు నాలో ఆలోచనలు కలిగించాయి. క్లీనరు గుడ్డతను చేతిలో నాణాలు పోస్తుంటే నేనతన్ని చూశాను. మనిషి దృఢంగా ఉన్నాడు. అయిదడుగులు దాటి పొడవు. నల్లటి మనిషి. కళ్ళ కింద నల్లటి చారలు. కనురెప్పలు కదులుతున్నాయి గాని కళ్లలో చైతన్యం లేదు. కళ్లతో ఏదో వెతుక్కునే ప్రయత్నం. చల్లగ సన్నగా నవ్వుతూ బస్సుకతను 'టా టా' చెప్తుంటే కండక్టర్ రైరైట్ అన్నాడు.

నేను ఒక్కసారి నిద్రలోంచి మేలుకొన్నాను. ఎయిర్ బ్యాగును భుజాన తగుల్చుకుంటూ "నేనిక్కడ దిగాలి. అతనితో మాటాడాలి". అంటూ ఒక్క ఉదుటున బస్సు దిగాను.

కండక్టర్ ఏమన్నాడోనే వినలేదు. బస్సుకదిలింది. నేను బస్సుకదలగానే చుట్టూ చూశాను. ఆ తొమ్మిది గంటల ఉదయం వేళ మంచుతెరలు తొలగించుకుని సూర్యకిరణాలురోడ్డు కిరుప్రక్కలా ఉన్న చెట్లమీద పడుతూ మంచును కరిగిస్తుంటే అదృశ్యం వింతగా ఉంది. దూరాన ఉన్న కొండలపై నున్న మనోహర దృశ్యానికి

మంచుతెరలు సూర్య కిరణాలలో కరిగి రూపు దిద్దుతున్నాయి. రోడ్డు కిరుపక్కల పెరిగిన వరి పైరుల్లో పెరిగిన వరి కంకులు చలిగాలికి వయ్యారంగా కదులుతు, వయసొచ్చిన కన్నె పిల్లలు పైటలు సవరించుకుంటున్నట్టుగా సిగ్గు పడుతున్నాయి. తురాయిచెట్టు కింద గుడ్డోడు ఆ ప్రక్కనే ఒక పూరిల్లు- అక్కడికి కొద్ది దూరంలో కిళ్ళీబడ్డీ - ఆ పక్కనేటీ దుకాణం- పైర్ల అవతల స్పష్టాస్పష్టంగా పల్లెటూరు కనిపిస్తూంటే రోడ్డు ఇటు ప్రక్కంగా దిగాను. అక్కడే ఓ టీ దుకాణం - కిళ్ళీ బడ్డీ...కాస్తంత దూరంలో ఒక కల్లు దుకాణంనా కంటపడ్డాయి. బస్సుకదిలిపోగానే కనకాం బరాలు, తినుబండారాలు, సోడాలు అమ్ముకునే పిల్లలు గుడ్డతనికి దూరంగా ఉన్నచింత చెట్టు కిందికి చేరారు. నేను గుడ్డతను ముందుకి చేరి "నేను నీతో మాటాడాలని వచ్చానయ్యా" అన్నాను.

"ఎవరు బాబు తవరు?" నా కంఠస్వరం వచ్చిన వేపు తిరిగి మువ్వల చేతికఱ్ఱను చేతిలోకి తీసికొంటూ అతను.

"నేనొక బ్యాంకు ఉద్యోగినయ్యా! నీ కళ్ళగురించి తెలుసుకుని, వీల యితే సహాయం చేద్దామని వచ్చానయ్యా". అన్నాను.

"లోనిప్పిస్తారా బాబూ!" అన్నాడు ఆశగా.

"కాదయ్యా! నిన్ను డాక్టరు దగ్గరికి తీసికెళ్ళి - పరీక్ష చేయించి వీలయితే కళ్ళకి ఆపరేషను చేయించి చూపు తెప్పిద్దామని". అన్నాను.

"నా కళ్ళకి ఆపరేసనా? నాకు మల్లా సూపా! నిజమా బాబు. మీరెవలు బాబూ, నామీద మీకెందుకింత దయ?" అతని గొంతు వణికింది.

"అన్ని అవయవాలలోకి మనిషికి కన్నే ముఖ్యం. మా స్నేహితుడు కంటి డాక్టరు. నిన్ను చూచిన తరువాత సహాయం చేయాలనిపించిందయ్యా!" అన్నాను.

నా మాటలు వినికాబోలు నలుగురు నా చూట్టూ చేరుతూంటే "నీకెవరూ లేరా?" అన్నాను.

"లేకేం బాబూ! మా ఆడదాయుంది. పిలవమంటారా? ... సాయిత్రే...సాయిత్రే" అమటూ కిళ్ళీ బడ్డీ వేపు తిరిగా పిలిచాడు. నేను అటు తిరిగాను. ఎవరితోనూ మాటాడుతున్న స్త్రీ "ఏటి మావ?" అంది. అక్కడ నుండే. "రాయే! ఒక్కపాలి" అని అతను పిలుస్తుంటే, ఒక కాలు మడుచుకుని, ఒక కాలు క్రిందికి వేలాడేసి ఆడిస్తున్నదల్లా, కాలాడించడం మాని, ఎదుటి వ్యక్తికి కిళ్ళీ అందించి "ఏటిమావ?" అంటూ పరుగెత్తుకొచ్చింది. మనిషి చామనచాయలో ఉంది. మనిషిపొడవు. ముఖంకళగా ఉంది. ముక్కున ఎఱ్ఱరాయి బేసరి - చెవులకు జూంకాలు - ప్రత్యేక శ్రద్ధతో కట్టిన చీరకట్టు-ఎలాటి మగాడినైనా ఎదిరించ గల కళ్ళు-మనిషిని వశపరచుకోగల చూపులు ఆమెలో ప్రత్యేకతలు. రాత్రి పెట్టుకున్న కాటుక చెరిగిపోయినా, పూలు వడిలిపోయినా ఆమెకు అలంకారాలుగానే ఉన్నాయి.

నన్ను ఎగాదిగా చూస్తూ "ఏటిమావ?" అంది అతని దగ్గరగా నిలబడి. నేనే కలుగజేసుకుని "ఇతని కళ్ళు-గుడ్డితనం గురించి కొన్ని వివరాలు కావాలమ్మా!" అన్నాడు.

"యానికి?" అంది నొసలు చిట్లించి. బేసరిలో ఎఱ్ఱ రాయి తళుక్కు మంది.

"వీలయితే ఆపరేషన్ చేయిద్దాం. ఇతనికి కంటిచూపొచ్చే అవకాశమండొచ్చు".

"ఆపరేసనేటి? గుడ్డోడికి కల్లు రాడమేటి?" అందామె చేతులు తిప్పుతు.

నేనామె మాటలు పట్టించుకోక "నీకు పుట్టిన దగ్గరినుండి గుడ్డితనమా?" అడిగాను.

"నేదు బాబూ. నేనందర్లా బాగానే ఉండేవోణ్ణి. బస్సులో క్లీనరు కుఱ్ఱాడిగా ఉండేవాణ్ణి బాబు. బస్సు ఏక్సిడెంటయి తలకి దెబ్బతగిలినాది. కంటికే ప్రమాదమొచ్చింది బాబు. సూపు పోయింది".

నేను కనురెప్పలు దూరం చేసి చూశాను. కన్ను ఆరోగ్యంగా ఉండి, 'ఆప్టికెనెర్వ్' ఆరోగ్యంగా ఉంటే దెబ్బతిన్న కార్నియాను తొలగించి మంచి కార్నియాను వేసి చూపు తెప్పించవచ్చు. దీనిని వైద్యశాస్త్రంలో 'కార్నియల్ గ్రాఫ్టింగ్' లేక కెరటో ప్లాస్టీ' అంటారు. అతని రెండు కళ్ళు ఆరోగ్యంగా ఉన్నట్టు, కంటి చూపు వచ్చే అవకాశమున్నట్టు నా కనిపించింది. అయితే ఈ మాటనేను కాదు చెప్పాల్సింది. డాక్టరు చెప్పాలి. నేనిలా కళ్ళను పరీక్షిస్తుంటే నా చుట్టూ జనం చేరారు. ఎవరో కఱ్ఱ కుర్చీతెచ్చివేశారు. అందరి చూపులు నా మీదనే.

"ఈడికి సూపొస్తదంటవా బాబూ"? ఎవరో అడిగారు.

"ఆపరేషన్ చేస్తే రావచ్చు. వస్తుంది సందేహం లేదు".

"ఎక్కడ సేస్తరీ ఆపరేషను?" అడిగాడతనే.

"పెద్ద పెద్ద నగరాల్లో ఉంది. హైదరాబాద్‌లో చేస్తున్నారీ ఆపరేషను. మనం అంత దూరం వెళ్ళక్కరలేదు. వైజాగ్‌లో నా మిత్రుడు చేస్తున్నాడు". అన్నాను.

"అయినా మనకెట్టా అవుద్ది? దానికి శాన కరుసు అవుతాదేమో?" అన్నారెవరో.

"అవుతుందిగాని సహాయం చేసే సంస్థలున్నాయి. ఆ సహాయం నేను చేస్తాను. కాని ఓ పది రోజులు దాటైనా హాస్పిటల్‌లో ఉండాలి".

"అన్ని దినాలూ ఆపరేషనే చేస్తారా?" అంది సావిత్రి.

"కాదు ఆపరేషన్ జరిగేది ఒక్క రోజునే. కాని కన్ను దొరకాలిగా".

"వీటి? కన్ను తీసి కన్నేస్తరా? ఎవలది?" అంది సావిత్రి.

"మనిషి కన్నే పనికివస్తుంది. చచ్చిపోయిన మనిషి కంటిని తీసి రెండు రోజులవరకు కాపాడవచ్చు. ఆ కంటిలోని పొరని ఉపయోగించి ఆపరేషన్ చేసి చూపు తెప్పిస్తారు డాక్టర్లు. కన్ను తీసి కన్ను వేసే రోజులింకా రాలేదు".

"అద్గదీ! అదేదో సినిమాల సూపు పోయిన 'ఈరో'కి డాక్టర్లు ఆపరేషన్ చేసి

సూపు తెప్పించనేదా! అలాగన్నమాట" ఒక పడుచు పిల్ల అందరికీ వివరించింది.

"అవును మీరూ సినీమాల్లో చూస్తుంటారుగా, అలాగే". అనిగుడ్డతని వేపు తిరిగి" ఏమయ్యానాతో వస్తావా వైజాగ్? నీ అదృష్టం బాగుంటే చూపు రావచ్చు కదా!" అన్నాను.

"అనాగే బాబు వచ్చేత్తాను. మీరెప్పుడు రమ్మంటే అప్పుడు పారొత్తాను. సూపునిప్పిత్తానంటే కాదంటానా బాబూ!" అన్నాడు చేతులు జోడిస్తూ.

"ఏటి మావ? లేడికి లేసిందే పరుగా, కల్లావరేననంటే మాటలను కుంటున్నావా! ఆపరేసను డాక్టరు బాబు ఉత్తిపున్నాన సేసినా పై కరుసులికి, మందు మాకులికి, తిండి తిప్పలకి పైసలుండక్కర్నేదా?" కసురుకుంది సావిత్రి.

"అయితే ఏటంటావమ్మా? ఆపరేషనేవద్దా?" అడిగాను సావిత్రిని.

"అలాగెందుకంటాను బాబూ? చేతిలో పైనల్బానుకుని ఆపరేషను సేయించుకుందారి అంటాను. ఆడికిసూపొస్తే నాకు సూపొచ్చినట్టుకాదా?" అంది.

"ఏటే సాయిత్రీ! అనాగంటావు! రోజూ నే సంపాయించే పైసలన్నీ ఏట యిపోతన్నాయే. ఎప్పటికప్పుడు పైసలన్నీ నీ సేతనే కదా నే పోస్తన్నది?" అన్నాడు గుడ్డతను. గయ్యిమని లేచింది సావిత్రి.

"ఏట్రా మావ! ఏలు లచ్చలు సంపాయించి నా చేతిలో గుమ్మరించే మొగోడిలా మాటాడేస్తన్నావు? నీ డబ్బులు నానేం మింగేస్తున్నానా? వచ్చిందల్లా నీ బీడీ కట్టలికి, నల్లమందు ముద్దలికి, తిండికి సరిపో లేదట్రా! నానేం తినేస్తన్నాను? నానేం దాచేసికుంతన్నానా? ఇంకా నేనే నిన్ను పోషిస్తున్నాను. నివ్వేం నాకుపెట్టీడం నేదు". అంది చేతులు తిప్పుకుంటూ ఎత్తు గుండెల మీద నుండి పైట జారిపోతున్నా, పొడవు వాలుజడలో పూలు నేలరాలుతున్నా ఆమె పట్టించుకోవటం లేదు. ఆమె కళ్ళలో నిప్పులు రాలుతున్నాయి. నాకా పరిస్థితి దుర్భరంగా ఉంది. నేను బ్యేగు భుజాన వేసి కుంటూ " ఈ తగువు చూడాలని నే రాలేదమ్మా.. మీకు యిష్టమయితే ఇతన్నినాతో పంపండి లేకపోతే లేదు. మీరు మాత్రం తగవులు పడకండి. మా సంస్థ ద్వారా ఒక మనిషికి ఈ రకంగా సంవత్సరానికి సహాయం చేయటం మా ఉద్దేశం. ఇక మీ యిష్టం". అన్నాను.

"తవరంత కోపగించుకోకండి బాబూ! మీ మాటలు మాకు వరాలు బాబు. కాని తవరు మమ్మింతతొందరపెట్టబోకండి. మేము చేతలపైసలు జమ జేసుకుని, ఓ నెల్లోపల మీరేడికిరమ్మంటే ఆడకే వత్తాము. మాకు మాత్తరం టయిమివ్వాల". అంది సావిత్రి కొప్పు ముడేసుకుంటూ.

వాళ్ళని తొందర పెట్టడం మంచిది కాదనిపించింది. ఆమె మాటల్లో సత్యమూ కనిపించింది. నా చిరునామా కాగితం మీద రాసిచ్చాను. మా ఇల్లు సులభంగా ఎలా కనుక్కోవడమో చెప్పాను. ఉత్తరం రాస్తేనేనే వచ్చి తీసికెల్తాననీ చెప్పాను. వచ్చిన అవకాశాన్ని మాత్రం జారవిడుచుకోవద్దని చెప్పాను. ఇద్దరూ నా మాటలు

శ్రద్ధగా విన్నారు.

"తవరు సెప్పినట్టే సేస్తాం బాబూ". అంది సావిత్రి.

గాలి వీస్తే చెదిరిపోయే మేఘాల్లా నా చుట్టూచేరిన జనం టవును నుండి వచ్చే బస్సు రావడంతో చెదిరిపోయారు. గుడ్డతను తన మువ్వల కఱ్ఱను అందుకుని ఎటన్షన్ పొజిషన్‌లో నిలబడ్డాడు. పువ్వులు, తినుబండారాలు, సోడాలు అమ్ముకునే కుఱ్ఱాళ్ళు బస్సు చుట్టు చేరి అమ్మకాలు ప్రారంభించారు. "చిత్రిగా నువ్వు కిళ్ళీ బడ్డీల కూకో". అని పురమాయించి సావిత్రి టీ దుకాణం వేపు పరిగెత్తింది. డ్రైవరు-కండక్టరు బస్సు దిగారు. వాళ్ళవెనుకనే కొంతమంది జనం - టీ దుకాణంలోకి చొరబడ్డారు. డ్రైవరు గ్లాసుడు నీళ్ళు పుక్కిలించి ఉమ్మి, రూమాలుతో ముఖం తుడుచుకుంటూంటే, కండక్టరు లోపలి నుండి వచ్చే డ్రైవరుతో ఏదో చెప్పాడు. వాళ్ళిద్దరూ నన్ను వింతగా చూడటంగమనించాను. ఇంతలో క్లీనరు కుఱ్ఱాడు తాను పోగుచేసిన పైసలు గుడ్డతని చేతిలో పోసి "రూపాయి పది పైసల్రా గుడ్డోడా!" అని టీ దుకాణం వేపు పరుగెత్తాడు. గుడ్డతను చిల్లర నాణేలను గుప్పిటలో పట్టుకుంటూంటే నేనడిగాను "అందరూ గుడ్డోడా అంటారే నిన్ను. మరి నీకు పేరు లేదా?" అని.

"లేకేంబాబూ! ఉన్నాది. కాని దాన్నినేనేపొద్దో మరిసిపోయినాను బాబూ! నా పేరు 'సిరంజీవులు' గాని 'సిరంజీవులం' టే ఎవులుకీ తెలవదు బాబు. 'సిరంజీవులు' సినీమాల ఎన్టీ రామారావు గుడ్డోడయిపోనేదా బాబూ! మా అయ్య అమ్మనాకేల ఈ పేరెట్టినారో గాని, నాను ఎన్టీవోడిలా గుడ్డోడినయిపోయినాను బాబు". అన్నాడు కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"అప్పటికి నీకు పెళ్ళయిందా?" అడిగాను.

"నేదు బాబు నాను గుడ్డోడినయినాకే సాయిత్రి నన్ను పెల్లాడింది. మాది ఆ కొండ పక్కనున్న పల్లెటూరే బాబు. నాను గుడ్డోడి నయినాక బస్సోలందరూ నాకీడగుడి సెకట్టించి, ప్రతీ బస్సునాపించి, ఇలా రూపాయి, అర్ధ, కలక్సనుసేసి నా సేతిలో పెట్టి 'బతకరా నా కొడకా' అని ఆదారం చూపినారు బాబు. నాకో అన్న, ఒదినమ్మ ఉన్నారు బాబు. గాని ఆల్లేవీ నన్ను సూడ్రు. సాయిత్రి తండిరి నాకు దూరపు బందువు. ఆళ్ళదీ ఈ దగ్గరూరే. ఆళ్ళు బీదోల్లు. నలుగురు కల్సిసాయిత్రి మెడలో తాళిగట్టించినారు బాబు. సాయిత్రి శానా మంచిది. నానంటే పానం. ఇందాకల అలా మాటాడినాదంటే నా మీద ప్రేమ నేక కాదు బాబు. పైసలు సేతల్లేక. దాన్ది మంచి జాతకం. అదొచ్చినాకే నా జాతకం మారినాది. నా సంపాదన మారినాది. అదే సిన్నటీ దుకానం మెట్టినాది. ఈ పక్కనే కిల్లీ దుఖామెట్టినాది. అది శాన తెలివైంది బాబు. ఉదయం టవునుండి వచ్చే బస్సులు, పోయే బస్సులు ఈడనే ఆగి కాఫీ, టీ, టిపిని దీసుకుని ఎల్తాయి బాబు. మా దుకానాలొచ్చినాకే సుట్టుపక్కల బడ్డీ దుకానాలు, మంగలి సాపులు, దరిజీ దుకానము వచ్చినాయి. ఇయ్యన్ని సాయిత్రి ఎట్టించినయే. ఈ సెంటర్ల సాయిత్రి మాట కెదుర్నేదు బాబు. అదిక్కడ మారాణి.."

అని స్వరం దగ్గించి "బాబూ! అందరూ సాయిత్రి అందంగుంటది - అందంగుంటది అంతారు బాబూ. సాయిత్రి నవ్వితే ఎవ్వరైనా ఇట్టే అయిసయిపోతరంట. ఓరగ సూసిన దంటే - ఎన్నెల కురిసినట్టు ఉంటాదంట - నిజవాబాబూ! దాన్ని ఒక్కపాలి నూడాలి బాబూ! ఈ కళ్ళతో నూడాలి బాబు". అన్నాడు చిరంజీవులు! "తప్పకచూద్దువుగాని చిరంజీవులూ. నీ ఆశనెరవేరుతుంది. ఇంతకు ముందు నీవెప్పుడూ సావిత్రిని చూడలేదా?"

"సిన్న సెడ్డీ ఏసుకునే యాళ ఎప్పుడో చూసినానేమో గురుతులేదు" అన్నాడు.

నేనిలా అతనితో మాటాడుతూనే ఉన్నాను. నా చూపులు మాత్రం సావిత్రి టీ దుకాణంకేసి తిరుగుతున్నాయి. సావిత్రి - టీ దుకాణం నాకు స్పష్టంగా కనిపిస్తూంటే నా ఆలోచనలు సావిత్రిని అంచనా వేస్తున్నాయి. సావిత్రి టీ దుకాణంలో చలాకీగా తిరుగుతోంది, టీలు, టిఫిన్లు అందిస్తూ. ఒక చేత్తో డబ్బులు వసూలు చేస్తూనే పని వాళ్ళ మీద అజమాయిషీ చేస్తోంది. బస్సు డ్రైవరూ, కండక్టరు ఆమెతో పరాచికాలాడుతూంటే నవ్వుతూనే సమాధానమిస్తోంది. బస్సు కదిలేవేళయింది. డ్రైవరు, కండక్టరు బస్సువేపు వెళ్తూ "ఏరా గుడ్డోడా కళ్లాపరేషన్ చేయించుకుంటావా? అయితే మరి మాకిక్కడ ఆగేపనే ఉండదన్నమాట". అని అరుస్తూంటే, క్లీనరేదో అన్నాడు. ఇద్దరు కిసుక్కున నవ్వారు.

"ఏటి బాబు ఆల్లంటున్నది? నాకు కల్లొత్తే బస్సులీడ ఆగవా? మరి నానెట్టా బతికేది బాబూ!" అన్నాడు చిరంజీవులు అందోళనగా.

"కళ్ళున్న వాళ్లందరూ ఎలా బ్రతుకున్నారో నీవూ అలాగే బ్రతుకుతావు చిరంజీవులూ. ఈ అయిదు పది పైసల కోసం కళ్ళు లేకుండా చేసికోవుగా". అన్నాను.

"లేదు బాబు. నాకు కళ్ళుకావాలి. ఈ కళ్ళతోనే సాయిత్రిని సూడాల".

అంతలో పరుగెత్తుకుంటు వచ్చింది సావిత్రి. "ఈ బస్సు బీజారులో తమర్నిమరిచిపోనాను. రాండి బాబు మా ఓటేలులో కాఫీ, టఫిను తీసుకుందురు గాని". అంది.

"టయిము లేదమ్మా! బస్సొస్తే వెళ్ళిపోవాలి". అన్నాను.

"టవునెల్లే సన్నాయి నొక్కులు బస్సుకింకా టయిమున్నాది బాబు. ఏ బస్సయినా ఈ సెట్టుదరి అగక ఎల్లదు బాబు. రాండి". అంది.

"ఎల్లండి బాబు! మీలాటి దరమ పెబువులు మా కెట్టా దొరుకుతరు బాబు. మా ఓటేలు మంచి సెబ్బర సూడండి". అన్నాడు చిరంజీవులు.

సావిత్రి ఉప్మా, పెసరట్టునా ముందు పెట్టింది. గాజు గ్లాసు బాగా కడిగి మంచి నీళ్ళు పెట్టింది. మంచి కాఫీ చేసి యిచ్చింది. టిఫిన్, కాఫీ బాగున్నాయి. బహుశా వీటి కోసమేనేమో ప్రయాణీకులు ఇక్కడికి రావడానికి ఇష్టపడుతు న్నారనిపించింది.

"వీలయినంత తొందరగా చిరంజీవుల్ని తీసికొస్తే పరీక్ష చేయించి, ఆపరేషన్ చేయిద్దాం. " అన్నాను బిల్ డబ్బులు టేబిల్‌మీద పెడుతూ.

"అలాగే బాబూ!" అంది సావిత్రి.

ఎందుకో వెనక్కి తిరిగిన నాకు సావిత్రి మూడు వంకర్లగా మూతి తిప్పినట్టనిపించింది. నా మీద ఈమెకు నమ్మకం లేదా? లేకనా ప్రయత్నం మీద ఈమెకు నమ్మకం లేదా? లేక అసలు ఈ ప్రయత్నమే ఈమెకు ఇష్టం కాదా! నా కర్థం కాలేదు.

'సన్నాయి నొక్కులు బస్సొచ్చింది'. అంటూ ఎవరో అరిచారు. నేను వెళ్ళాల్సిన బస్సు అది. దాని పేరు సన్నాయి నొక్కులట. నేను దిగిన బస్సు పేరు 'తుఫాను మెయిలు' అట. తపేలా బస్సు ఈ ఉదయం రాలేదట. "దెక్కడ ఆగిపోయిందో ఎవరికీ తెలీదట - ఎవరో అనుకుంటూంటే వింటూ బస్సు వేపు నడిచాను. ఇంతలో ఎవరో నన్నుబస్సు చాటుకి పిలిచి "బాబూ! మీతో ఓ మాట. తమరు మరిటు పక్కకి రాకండి". అన్నాడు.

"ఎవరు మీరు? ఎందుకిలా చెపున్నారు?"

"నా పేరు ఏదైనా సన్నందరూ పానకాల రాయుడు అంటారు. నేను రాత్రి పగలు మందు మీద ఉంటాను. కాని నిజమే చెప్తాను బాబూ. సావిత్రికి గుడ్డోడికి కళ్ళు రావటం యిష్టముండదు బాబు. సావిత్రికే కాదు ఇక్కడున్న ఎవరికి ఇష్టముండదు". అన్నాడు. అతను మాటాడుతుంటే సారా వాసన.

"ఎందుకని?" అడిగాను.

"అదంతే బాబూ. నన్నేమీ అడగబోకండి. నేనిలా చెప్పినట్టు ఎవరితోను అనకండి". అంటూ వచ్చినంత వేగంగా తిరిగి వెళ్ళిపోయాడు.

కొద్దిసేపునా మనసు పని చేయలేదు. బస్సు కదులుతూంటే ఎవరో పెద్ద పెట్టున నావెనుక నవ్వినట్టనిపించింది. బస్సు కదులుతున్నాఎన్నో ఆలోచనలు నన్ను విడవలేదు. వైజాగ్ చేరిన వెంటనే డాక్టర్ చంద్రశేఖర్‌ని కలిశాను. చిరంజీవుల్ని తీసికొస్తే పరీక్షించి-అవకాశమున్నదంటే ఆపరేషన్ చేయిద్దా మన్నాడు. 'ఐ డోనర్' గురించి వెతుక్కోనక్కరలేదన్నాను.

నేను 'గుడ్డోడి చెట్టు' దగ్గర జరిగిన సంఘటనలన్నీ చెప్పి పానకాలరాయుడు చెప్పిన మాటలు కూడా చెప్పాను. అంతా విని డాక్టర్ అన్నాడు "చూడూ, పేషంటు ఇష్టపడి వచ్చినప్పుడు నా సాయశక్తులా ప్రయత్నించి కంటి చూపు తెప్పించే విధి నాది. ప్రయత్నం నీది. వాళ్ళకిష్టం లేనప్పుడు మనమేమీ చేయలేం. అంతే కాదు వాళ్ళ వ్యక్తి గత సమస్యలని పరిష్కరించే అవుసరం కూడా మనకు లేదు. వాళ్ళు సహాయం కోరి వచ్చారా మంచిదే. రానప్పుడు మనసు పాడుచేసుకునే అవసరం లేదు". అని.

ఓ మనిషి గుడ్డితనంతో మగ్గిపోవాలని కోరుకోడు. చిరంజీవులు సావిత్రిని కళ్ళారాచూచుకోవాలని మనసారా కోరుకుంటున్నాడు. అవకాశమున్నప్పుడు అతని కోరికను తీర్చే విధి సమాజానికున్నదని నా నమ్మకం. నా ప్రయత్నాన్ని విరమించ దలుచుకోలేదు. చిరంజీవులుకి చూపు వచ్చినా, మున పటిలా గుడ్డోడి సంపాదన పోయినా సావిత్రి నడిపే హోటలు -కిల్లీ బడ్డీల వల్ల వాళ్ళు హాయిగా బ్రతకవచ్చు.

చిరంజీవులుకి ఎలాగైనా సహాయపడాలను కునేంతలో సావిత్రి చెప్పిన నెల రోజుల గడువు దాటిపోయింది. ఇంతటిలోనే నేనెప్పుడో వస్తుందనుకున్న ట్రాన్స్‌ఫర్ ఆనెలలోనే వచ్చింది, గుంటూరికి. రిలీవర్ రాగానే గుంటూరు వెళ్ళిపోక తప్పదు. వైజాగ్ కాబట్టి రిలీవర్ ఎంత వేగంగానైనా రావచ్చు. మరినేను ఆలస్యం చేయదలచుకోలేదు. ఆ రోజు బ్యాంకు నుండి త్వరగా బయటపడి 'పాలెం' వెళ్లే బస్సు ఎక్కాను.

"మీరా బాబూ!" అన్నాడు టిక్కెట్లు కట్ చేస్తూ కండక్టర్. గుర్తుపట్టాను. అతను తుఫాన్ మెయిల్ కండక్టర్. ఆ బస్సులోనే, నేను గుడ్డోడి చెట్టుకి మొదటిసారిగా ప్రయాణం చేసి వెళ్ళాను.

"గుడ్డోడితో మాటాడారా బాబూ! గుడ్డోడికి కంటాపరేషన్ చేయిస్తారని విన్నాను". అన్నాడు.

"అవును. ఆ పని మీదే అక్కడికి వెళ్తున్నాను". అని చెప్పాను. నెమ్మదిగా నా పక్కన కూర్చుంటూ రహస్యంగా "సావిత్రి గుడ్డోడికి ఆపరేషన్ చేయించదు బాబూ". అన్నాడు.

"ఎందుకని?"

"మా బస్సులన్నీ అక్కడెందుకాగుతున్నాయి? గుడ్డోడి కోసమే కదా. ఒక నిముషం కన్నా ఎక్కువ అగని బస్సులు ఇప్పుడు పది నిముషాలైనా ఆగి కాఫీ, టీ, టిఫిన్లు తీసుకునే కదా బయలుదేరుతున్నాయి. గుడ్డోడికి కళ్ళొస్తేమరి మాకక్క ఆగేందుకు అవసరమేమిటి? బస్సులాగపోతే సావిత్రి టీ దుకాణం మూలపడదూ? బతుకు పోదూ? గుడ్డోడు లేడు కాబట్టి బస్సులక్కడ ఆపక్కరలేదని మా యజమానులంటే ఎందరికి ఎంత ఇబ్బందో తెలుసా బాబూ! ముఖ్యంగా బస్సులాగపోతే సావిత్రి, రాయుడు చేసేగంజాయి, నల్లమందు వ్యాపారాలకి అడ్డొస్తుంది. అక్కడున్నవారి బతుకులు పోతాయి. అక్కడున్న వాళ్లందరూ అలో లక్ష్మణా అని ఏడ్వాల్సిందే. ఇక మంచాలయాపారం మీదే సావిత్రి బతకాల".

"మంచాల వ్యాపారమా?"

"అవును బాబూ. మంచి వయసులో ఉండి పిట పిట లాడుతున్న గుంటల్ని అది టవునుకి పంపుతాది. సాయంత్రం ఆరు గంటల బస్సుకెళ్ళి మళ్ళీ పది గంటల బస్సులో తిరిగొస్తారా చిలకలు. ఈ వీళ్ళందరికీ టవున్లో బ్రోకరుగాడొకడున్నాడు. రాయుడుకి, సావిత్రికి, వీడికి అన్ని వ్యాపారాల్లో వాటాలు. మరి బస్సులిక్కడాగకపోతే ఆ వ్యాపారం మూలపడ్డట్టే కదా. ఆ మంచాలేవో ఇక్కడే వేసుకోని బతకాల. గుడ్డోడిని అడ్డు పెట్టుకుని బతికే వారెందరో బాబు".

"ఇంతకూ రాయుడెవరు?"

"సావిత్రి ఉంచుకున్నవాడు. సావిత్రికి కావలసినవాడు. ఆ ప్రాంతానికతడు పెద్దమనిషి".

"ఈ విషయాలేవీ చిరంజీవికి తెలియవా?"

"చిరంజీవెవరు?"

"గుడ్డతని పేరు చిరంజీవులు కదా!"

"అలాగా మాకు తెలీదు బాబూ. సావిత్రి ఎంత చెడ్డదయినా చిరంజీవులంటే ప్రాణం. చిరంజీవుల్ని ఎవరేమన్నా ఊరుకోదు. చిరంజీవులికి సావిత్రి అన్నా ప్రేమే. చిరంజీవులికి తెలియనిదేమో జరుగుతున్నది" అన్నాడు.

బస్సు గుడ్డోడి చెట్టు దగ్గరకొచ్చేసరికి ఏడుగంటలయింది. "తొమ్మిది గంటలకల్లా జంక్షన్ కెళ్ళే బస్సుంటాది. అందులో వెళ్ళిపోండి బాబూ. రాత్రక్కడ ఉండకండి". అంటూ నాకు సలహా యిచ్చాడు కండక్టరు.

నేను దిగిన చోట చీకటి ముద్దగా నిద్దరోతోంది. పగలంతా సందడిగా ఉండేచోట నిర్జీవంగా ఉంది చిరంజీవులు గుడిసె కాబోలు గుడ్డి దీపం వెలుగుతోంది చలికాలి రివ్వున వీచేసరికి మఫ్లరు చెవుల చుట్టూ చుట్టాను. నాలుగడుగులు వేయగానే "ఎవరికోసం బాబూ! సావిత్రి కోసమా?" అన్నా మాటలు విని పక్కకు తిరిగాను. సారా వాసన గుప్పున కొట్టింది. నేను సమాధానమిచ్చేలోగా "సావిత్రికియ్యాళ తీరదు. రాయుడు రమ్మంటే ఎల్లింది. వస్తే ఓ గంటలో వస్తాది. లేకుంటే రాత్రంతా అక్కడ్నే ఉంటాది. అది లేకపోయినా చిన్నమ్మడు, దానక్క ఉన్నారు. పిలవమంటారా?" అన్నాడు. నేనుగుర్తుపట్టాను. అతను పానకాలరాయుడు. కాని అతను నన్ను గుర్తుపట్టలేదు.

"గుడ్డోడు లేడా"? అనడిగాను.

"అడెక్కడికి పోతాడు బాబూ! నల్లమందేసుకుని గుడిసెలోనే తొంగో నుంటాడు. పైసలియ్యండి మందేసుకోని వస్తా". అన్నాడు. అతన్ని వదిలించుకోవడం కోసం అతని చేతిలో అయిదు రూపాయల నోటు పడేశాను.

"ధర్మ ప్రభువులు మారాజా. చల్లగుండాల ఉండండి. మిమ్మల్ని సావిత్రికాడికే తీసికెల్తాను". అన్నాడు చింతచెట్టు కిందికిపోతూ.

చిరంజీవులు గుడిసె వేపు నడిచాను. నే వెళ్లేసరికి నులక మంచం మీద కూర్చుని పొగాకు చుట్ట చుట్టుకుంటున్నాడు. నా అడుగుల సవ్వడి విని "ఎవరిది?" అన్నాడు.

"నేను చిరంజీవులూ". అన్నాను.

"తవరా బాబూ. ఎప్పుడొచ్చేరేటి? సాయిత్రి లేదు బాబూ. సినీమా కెల్లింది. ఆ స్తంబం కాడ కుర్సీ ఉంటాది కూకోండి. మీరెప్పుడొత్తారని ఎదురుచూస్తన్నాను బాబూ". అన్నాడు.

"అయితే నాతో వచ్చేస్తావా చిరంజీవులూ?" ఆశగా అడిగాను.

"మీతో ఎల్పొమనే అంది బాబూ సావిత్రి. కాని మల్లా తిరిగి రావద్దంది. మీకాడనే ఉండిపొమ్మంది. తన్ను మర్సిపొమ్మంది బాబూ... బాబూ.. సావిత్రి నేకండా నేను బతగ్గలనా?.. అదంటే నాకు పంచ పానాలు బాబూ. అది బాదపడితే నా గుండె అదిరిపొద్ది బాబూ! బాబూ మీరన్న సెప్పండి నన్ను తిరిగిరమ్మని సెప్పమని...అది మీ మాటింటాది". అన్నాడు.

"మీరిద్దరూ బాగ ఆలోచించుకోవాల్సిన విషయం చిరంజీవులు. నేను మాత్రం మీ ఇద్దరిని విడివిడిగా ఉండమని ఎలా అంటాను?" అన్నాను.

"నీవు నల్లమందు తింటున్నావని విన్నాను. అది మంచి అలవాటు కాదు. నీకు చూపు రావాలంటే నీవు నల్లమందు మానేయాలి" హెచ్చరించాను.

"అనాగే బాబూ! సాయిత్రి యిస్తావుంటే నానేసుకుంటన్నాను. రేప్పొద్దు కాడ్నించి మానేత్తాను బాబూ". అని చిరంజీవులంటూంటే "బాబూ!" అంటూ అవతల కేక - (పిలుపుకాబోలది) వినిపించింది. నా కర్థమైంది. వచ్చినవాడు పానకాలరాయుడు. కొద్దిగ ఆలస్యం చేస్తే లోపలికే వస్తాడేమోన నిపించింది.

"ఇప్పుడే వస్తానుండు" అంటూ బయటికి పరుగెత్తాను.

నన్ను చూచి, "బాబూ! తవరు మంచోరు.నాకు పైసలిచ్చారు. సావిత్రి కాడికి తీసికెల్తారండి". అంటూ చెయ్యి పట్టుకోబోయాడు. "వస్తున్నాపద" అంటూ అతని వెనకనడిచాను. సావిత్రిని కలిసి చిరంజీవులు విషయం అడగాలనే నాకుంది. అతను పొలాలవెంట తీసికెడుతూంటే నడిచాను దారిని వెతుక్కుంటూ. చంద్రుడప్పుడే కొండల వెనుక నుండి వస్తున్నాడు. పల్చగ వెన్నెల - గాలి వీస్తున్నప్పుడల్లా చల్లగ ఒంటిని తాకుతూ మంచు కురుస్తోంది. పానకాల రాయుడేదో చెప్తునే ఉన్నాడు. అతని మాటల్లో ఎక్కువ సావిత్రి కదిలింది - సావిత్రి శరీర సుఖం తనకు తెలుసన్నాడు - సావిత్రి లాంటి ఆడదాన్ని చూడలేదన్నాడు. - రాయుడు ఆమెను ఎన్నో బాధలు పెడుతున్నాడని చెప్పాడు. మేము సగం దూరం వచ్చేవేమో ఎదురుగా చక చక నడుచుకుంటూ వస్తున్న సావిత్రి కనిపించింది. నన్ను చూచి కంగారుపడింది. "బాబూగారూ!" అంటూ భుజం మీద నుండి తెల్లచీర పైటకొంగు ముందుకు లాక్కుంది. ఆమె దగ్గరవగానే తలలో ఉన్న జాజులు వెన్నెల్లో కలసినవ్వాయి. గాలి రివ్వున వీస్తుంటే "సాయిత్రీ! నీకోసమీ బాబు వచ్చాడు. కాదనబోక. బాబుశాన మంచోడు. ఆ రావిచెట్టు కిందికెల్లిపొండి". అంటూ పానకాల రాయుడు వెనక్కెళ్లిపోయాడు. సావిత్రి సిగ్గుతో తలవాల్చుకుంటూంటే, "నేను నీతో మాటాడాలని వచ్చాను సావిత్రీ!" అన్నాను. "నీ కోసం కాదు". అని కొనసాగిస్తూ.

"తెలుసు బాబూ. రోజు మీ రేపొద్దు వస్తరో అని ఎదురు సూస్తనే ఉన్నాను. మీరెంత బేగి వస్తారానే సూస్తన్నాను బాబు".

"నాకు గుంటూరు బదిలీ అయిపోయింది. తొందరగా వెళ్ళిపోవాలి. వెళ్ళే ముందు చిరంజీవులు కళ్ళ పని చూద్దామని వచ్చాను" అన్నాను.

"రండి బాబూ! అక్కడ కూచోని మాటాడుకుందాం" అంది.

ఇద్దరం రావిచెట్టు కింద కూర్చున్నాం.

"నీవు ఇష్టపడితే చిరంజీవుల్ని తీసికెళ్దామని వచ్చాను". అన్నాను.

"తెసికెళ్ళండి బాబూ!" అంది చాల నిశ్చలంగా. ఆమె, నా వెనుక వెటకారంగా మూతి తిర్పిన సావిత్రి కాదు. ఒంటి మీద బట్టలు జారిపోతున్నా పట్టించుకోకుండ చిరంజీవుల్ని తృణీకరించిన సావిత్రి కాదు. వెకిలి నవ్వులు నవ్వుతూ, టీ దుకాణంలో తిరిగే లేకి మనిషి కాదు. అన్ని భావాలకు భిన్నంగా ఉంది.

"మరి అటు తరువాత రావద్దన్నావట కదా. నిన్ను మరచిపొమన్నావట కదా!"

"అవును బాబు. రావద్దనే సెప్పాను. ఈ పాలికినా సంగతి పూనాగ మీకు తెలిసే ఉంటాది. నాను అసుంటి దాన్నికానని సెప్పను. కాని నా సంగతి ఇంత దాక మా మావకేటి తెల్దు. ఆడికి కళ్ళొచ్చినాక ఆడు సూచి సయించడు. ఆడు బతకనేడు". అంది.

"అప్పుడు అందరిలా నీ వుండొచ్చుగా. ఈ వృత్తెందుకు?" అడిగాను.

"ఇది ఉత్తా బాబూ! నా మెడకు ఉరితాడు. నాను సంతోసంగా ఈ పనిని సెయ్యటం నేదు బాబు. నా పెళ్లికి ముందే ఓపాలి తిరన్నాల కెల్లి వస్తావుంటే ఈ సెట్టుకిందే నన్ను సెడగొట్టాడు బాబు ఓ పెద్ద మడిసి. అటు తర్వాత మరి నలుగురు-పెద్ద మడుసులు. నలుగురు కల్పిఏవీ తెలీని మీ 'సిరంజీవి' సేత నా మెడలో తాళి కట్టించినారు బాబు. మామ మంచోడు. మా మనువు జరిగినాక సెట్టు పక్కన టీ దుకానమెట్టించాడు మా నాయిన. అందుకు పైసలు ఈ సెట్టుకింద పున్నెంకట్టుకున్న పెద్ద మడిసే ఇచ్చాడు.టీ దుఖానం శాన యాపారలకి ఉపయోగించకుంటన్నాడు. ఆడిసేతులో నాను, ఇక్కడున్న అందరు కీలుబొమ్మల. నాకు సావాలన్నా, బతకాలన్నా నాచేతననేదు. ఈడు పోతే మరో గుడ్డోడొస్తాడు. ఆడుపోతే మరో గుడ్డోడొస్తాడు. ఈ సాయిత్రి పోతే, మరో సాయిత్రి. అదిపోతే మరోటి వస్తాది. ఈ సెట్టు మాత్తరం పోదు. అందికే మావను ఎల్లిపోమని సెప్పాను. ఈ పెద్దోల్లుఇంకా పెద్దోల్లు కావల్నంటే మామందరముండాల. అందికే సెప్పాను ఆడిని తిరిగి రావద్దని. ఆడుమాత్తరం పోనంటన్నాడు. నన్నేటి సెయ్యమంతారు?" అంది సావిత్రి కన్నీరు పెట్టుకుంటూ.

"నీవు వస్తే చిరంజీవి వస్తాడు". అన్నాను.

"నాను మాత్తరం రాను బాబు. రాలేను. నన్ను సెడగొట్టినోల్లనందర్నీ నాను సెడగొట్టాల. అందరు కుల్లికుల్లి సావాల. అది సూసిగాని నాను రాలేను బాబూ!'

"అలాంటి పట్టింపులకుపోతే జీవితాలు నడవవు. చిరంజీవులుకి చూపు రాదు. ఎప్పుడయినా మీరిద్దరే కల్సిరండి. చిరంజీవులుకి చూపు రాగానే మీరిద్దరు హాయిగా బ్రతికే మార్గం నే చూపిస్తాను. చీకటిలో ఉండే వాళ్ళెప్పుడూ చీకటిలో ఉండక్కరలేదు. మనిషి వెలుగును వెతుక్కోవాలి"

"వస్తాము బాబు". అంది సావిత్రి స్థిరంగా.

"ఎప్పుడు?" అన్నాను ఆశగా.

"దూడ చచ్చిపోతే ఆవు పాలిస్తదా బాబూ! చేట పెయ్యగానైనా పెట్టాల్నికదా. ఇదీ అంతే బాబు. కొద్ది నెలలు టయిమివ్వండి. మీ సిరంజీవులికి కల్లొత్తాయి". అంది సావిత్రి.

ఇద్దరంగుడిసెకి తిరిగి వచ్చాము. సావిత్రితో కలిసి రమ్మని చిరంజీవులికి బోధపరిచాను. నా చిరునామా - డాక్టరు చిరునామా - అంతా వివరంగా రాసిచ్చాను- సావిత్రి ఎనిమిదో తరగతి వరకు చదువుకుంది. నేను చెప్పినవన్నీ అర్థం చేసుకుంది. నేను గుంటూరు వెళ్ళిపోయినా ఎప్పుడు ఉత్తరం రాసినా వైజాగ్ వచ్చి ఆపరేషన్

సమయానికి ఆదుకుంటానని చెప్పాను. సావిత్రి చాలా అడిగి తెలుసుకుంది. అయినా ఏం చెప్పగలం? 'ఇష్టంలేని పెళ్ళికి విందులు మెండు' అని కదా పెద్దలన్నారు.

సావిత్రి చేసి యిచ్చిన కాఫీ త్రాగి-పది గంటల బస్సుకి సిద్ధమయ్యాను. హారన్‌ని దూరంనించి విని నాతోపాటు చెట్టుకిందికివచ్చి బస్సు అల్లంత దూరంలో ఉందనగా చటుక్కున వంగి నా కాళ్ళకు దండం పెడుతూ "మీరు దేవుడు బాబూ!" అంది.

"తప్పు! అలా అనుకూడదు". అంటూ వెనక్కినడిచి, ఆగిన బస్సువేపు నడిచాను. నేను బస్సెక్కుతూండగా కన్నీటితో వీడ్కోలిచ్చింది సావిత్రి.

అటు తరువాత ఇరవై రోజులు వైజాగ్‌లో ఉండి గుంటూరు వెళ్ళిపోయాను. ఆటు పిమ్మట రెండు సంవత్సరాల తర్వాత గాని నాకు వైజాగ్ వెళ్ళే అవకాశం రాలేదు. ఈ మధ్యకాలంలో నాకు చిరంజీవులు గురించి గాని సావిత్రి గురించి గాని తెలియలేదు. రెండు సంవత్సరాల తరువాత గాని అటు వెళ్ళే అవకాశం ఏర్పడలేదు. అదీ మా మేనమామగారికి సుస్తీగా ఉందన్న వార్త వచ్చిన తరువాతే. ఆ ఊరికి వెళ్ళేదారిలోనే ఉంది ఆగుడ్డోడి చెట్టు-అక్కడ ఒక నిముషం అగి బస్సు వెంటనే బయలుదేరింది. అవి సరిగ్గా సంక్రాంతి రోజులు. ఈ రెండు సంవత్సరాల్లో ఈ మారుమూల ప్రదేశానికి కూడ స్టేట్ బస్సులు వచ్చాయి. ఆ సెంటర్ కూడా బాగానే పెరిగింది.

మా మేనమావగారికి ఆరోగ్యం బాగుండడం చేత రెండు రోజులకి తిరుగు ప్రయాణ పట్టాను. గుడ్డోడి చెట్టు దగ్గర దిగాను. చెట్టు - దుఖాణాలు అలాగే ఉన్నాయి. చెట్టు కింద చిరంజీవి లేడు. అతని జాగాలో ఒక ముసలాడు కూర్చున్నాడు-ముసలితనం వల్ల చూపు మందగించి ఉండ వచ్చుగాని అతను గుడ్డోడు కాడు...ఎవరో ఒకరు డబ్బులు జమచేసి దానం చేస్తునే ఉన్నారు.

"చిరంజీవులేడి?" అడిగాను కనకాంబరాలమ్ముకునే కుర్రాడిని.

"చిరంజీవులెవరు?" అన్నాడు వాడు.

"సావిత్రి భర్త. మీరంతా గుడ్డోడని పిలిచేవారు కదా". గుర్తుచేశాను.

"అడా! ఆడు సచ్చిపోండు" అన్నాడు వాడు.

"కాద్దొరా! అడ్ని సంపేశారు". అన్నాడు చేగో డీలమ్ముకునే కుర్రాడు.

"నీకెందికిరా అయ్యన్నీ! మాకు ఎరికనేదు దొరా" అన్నాడో పెద్దోడు.

"మరి సావిత్రి?" అడిగాను.

"ఏటైందో. ఎరికనేదు". అంటూ నలుగురు దిక్కులా వెళ్ళిపోయారు.

టీ దుకాణంవేపు వెళ్ళాను. అక్కడ సావిత్రి లేదు. అక్కడ భారీగానల్లగా ఉన్న స్త్రీ, హోటలు అజమాయిషీ చేస్తోంది.

"ఇక్కడ సావిత్రి! అనే ఆమె ఉండాలి ఎక్కడుంది?" అడిగాను. ఆమె నన్ను చిత్రంగా చూచింది. అక్కడున్నవారు నన్ను వింతగా చూశారు.

"ఏదీ! అదా! అది మొగుడ్ని సంపి జైలుకెళ్లిపోనాది" అంది.

"అబద్ధం సావిత్రి మొగుడ్నెందుకు చంపుతుంది?" అన్నాను ఆవేశంగా.

"సాగే రంకుకు అడ్డమొత్తే, మొగుడైన ముక్కలుకాక ఏటవుతాడు?" అందామె సాగదీసుకుంటూ. నాకక్కడ ఉండబుద్ధి కాలేదు.

బస్సు కోసం నిలబడితే "తవరా! బాబూ!" అంటూ పలకరించాడు పానకాల రాయుడు. ఉదయాన్నే సారా వాసన అతని నుండి గుప్పుమంటూంటే "నీవా?" అన్నాను.

"అవును బాబూ! గుడ్డోడిని రాయుడు చంపేశాడు బాబూ!" అన్నాడు. నాలో కుతూహలం పెరిగి "ఎందుకని?" అని అడిగాను రహస్యంగా.

"గుడ్డోడికి కల్లాపరేసన్ చేయించాలని సావిత్రి పట్టుపట్టింది. సావిత్రి టీ దుఖానం, కిళ్లీబడ్డీ అమ్మేసుకుని పోతానంది. రాయుడు సావిత్రిని వదల్లేదు. రాయుడుకి తెలియకుండ దుఖాణాలు బేరానికి పెట్టింది. గుడ్డోడి పీడ వదిలేత్తేనే గాని సావిత్రి తన మాట వినదని గుడ్డోడికి ఏదో కలిపిచ్చి- కడుపు నొప్పితో చచ్చిపోయాడని రాయుడు అందర్నీ నమ్మించాడు! పట్నం ఎల్తానంటే గుడ్డోడిని సావిత్రే చంపిందని పోలీసులకి చెప్తానని బెదిరించాడు. కేసు తన-మీద లేకండ ఉండేందుకు రాయుడికి లొంగినట్టు నటించింది. తరువాత ఇక్కడ జరిగేవన్నీ పోలీసులకి చెప్తానని బెదిరించింది. సావిత్రిని బతకనీయా కూడదని ఆ రాత్రే చంపేయాలనుకున్నాడు రాయుడు. అత్తెల్సుకుని ఆ రాత్రే పారిపోయింది సావిత్రి నమ్మకం నటించి. రాయుడు సావిత్రి కోసరం వెతికించాడు. కాని కనిపించలేదు. ఇదీ బాబు సావిత్రి సంగతి. బాబూ! నిషాదిగిపోయింది. మందేసుకుంటా పైసలివ్వవూ?" అంటూ చెయ్యిచాచాడు.

"ఇస్తాను గాని ఇన్ని విషయాలు నీకెలా తెలుసు? అడిగాను.

ఒక్కసారి నా ముఖంలోకి చూసి నాకు దగ్గరగా వచ్చి "చెప్పమంటారా బాబూ! అది .. అది నా కూతురు బాబూ! దాని బాధలన్నీ చూస్తు బతుకున్న తండ్రిని బాబు నేను. దాన్ని వీళ్ళు చెడగొట్టిననారు. దాన్ని పట్టుకుని ఎక్కడికి పోయినా అది సుకపడేది బాబూ". అంటూ రెండు చేతుల్లో ముఖం దాచుకున్నాడు. నా కసహ్యం వేసింది.

"ఎందుకా దొంగ ఏడుపు? కూతుర్ని తార్చే నీవు తండ్రివా? ఓ రాత్రి నేనొచ్చినప్పుడు సావిత్రిని పరాయిస్త్రీగా వర్ణించి చెప్పావు గుర్తుందా? నీవు సావిత్రి తండ్రివా?" గద్దిస్తున్నట్టు అడిగాను.

"అన్నాను బాబు. మీరని తెలీక సావిత్రి శరీరం మీద మోజు పుట్టించాలని అన్నాను బాబు. తన జీవితంలో ఒకసారైనా నిజమైన పురుష సుఖం నాతల్లి పొందుతుందేమోనన్న ఆశతో తార్పుడుగాడిగామారేను బాబు. ఆ బాధను భరించలేకనే తాగుబోతునయ్యాను బాబు. నన్నునమ్మండి బాబూ!" అంటూ నేనాగమన్నా ఆగకుండ పొలం గట్టు మీంచి వెళ్ళిపోయాడు.

నా మనసు ఒక్కసారి మొద్దుబారిపోయింది. సావిత్రి -చిరంజీవులునా కళ్ళముందు కదులుతూంటే నా కళ్ళ వెంటా నీళ్ళొచ్చాయి. అన్యమనస్కంగా బస్సెక్కాను. సావిత్రి చెప్పినట్టు మరో గుడ్డోడు-మరో సావిత్రి -ఇది ఆగని చక్రం.

వైజాగ్ చేరిన తరువాత చంద్రశేఖర్‌ని కలసిన సంఘటన చెప్పకపోతే కథ ముగింపుకు రాదు. గుంటూరుకు ప్రయాణమవుతూంటే చంద్రశేఖర్ ఫోన్ చేశాడు. "నీవు వచ్చేవని విన్నాను. వెళ్ళే ముందు ఒక్కసారి కలువు" అని.

చిరంజీవుల్ని దక్కించుకోలేకపోయానన్న బాధతో ఆలస్యంగా అతని దగ్గరికెళ్ళాను.

"రా! నీకోసమే ఎదురు చూస్తున్నాను".అన్నాడు డాక్టర్.

చిరంజీవులు-సావిత్రి గురించి నేను విన్నదంతా చెప్పాను.

"సావిత్రి ఇక్కడే ఉంది". అన్నాడు చాలా కూల్‌గా.

"నిజమా?" అన్నాను. డాక్టర్ ఇంటర్‌కమ్‌లో ఎవరినో పిలిచాడు. వెంటనే తలుపులు తెరుచుకుని వచ్చిన సావిత్రిని చూచి నివ్వెరపోయాను. తరువాత ఆనందించాను. తెల్లని చీరలో సహనానికి మారుపేరైన నర్సుదుస్తుల్లో సావిత్రి నన్నుచూచి ఒక్కసారి చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చేసింది.

"నేనక్కడికే వెళ్ళి వస్తున్నాను. అంతా విన్నాను. చిరంజీవుల్ని దక్కించు కోలేకపోయాం". అన్నాను నా కళ్ళలో నీరు తిరుగుతూంటే. తరువాత చంద్రశేఖర్ చెప్పాడు.

"చిరంజీవులు పోగానే నీకోసం ఇక్కడికి వచ్చింది. గుంటూరు వెళ్తానంది అక్కడికెళ్ళేకన్నా కళ్ళ కోనం అలమటించే అభాగ్యులకు సేవ చేస్తూ ఉండిపొమ్మన్నాను. నా మాట కాదనలేదు. దుఃఖం మరచి ఇక్కడే ఉంది. ఇంకో మాట-కంటి చూపులేని వాళ్ళని ఈమె అర్థం చేసుకుని ప్రవర్తించేలాగ మరెవరు ఉండలేరు. ఈమె సహనం కారణంగా పేషంట్లను చక్కగా మెప్పించగలుగుతున్నాను". - అతనలా అంటూంటే ప్రశంసాపూర్వకంగా సావిత్రి వేపు చూశాను. సావిత్రి సిగ్గుతో తలదించుకుంది.

"ఇంకో మాట చెప్పానా? సావిత్రి తన కళ్ళను డొనేట్ చేయడానికి రిజిష్టర్ చేసుకుంది". అని డాక్టర్ అంటూంటే అప్రయత్నంగా కుర్చీలోంచి లేచి రెండు చేతులు జోడించి "ఎంతగా ఎదిగి పోయావు సావిత్రీ" అని నేనంటూంటే "తప్పుబాబుగారూ!" అంటూ నా రెండు చేతులు పట్టుకుంది.

అప్పుడు చూశాను ఆ కళ్ళలో నైర్మల్యం. ఇలాటి సావిత్రులుండగా చిరంజీవులెప్పుడూ చిరంజీవులే అనిపించింది.

★ ★ ★